క్లుప్తంగా

రైతు సంక్షేమానికి పాలకవర్గం కృషి చేయాలి

హోంమంత్రి మహమూద్‌అలీ



వేబ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: మార్కెట్‌కు వచ్చే రైతుల సంక్షేమం కోసం పాలకవర్గం కృషి చేయాలని హోంమంత్రి మహమూద్ అలీ సూచించారు. మలక్‌పేట మార్కెట్‌లో రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని కమిటీకి సూచించారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్ చైర్మన్ కొరుడు భూమేష్, డైరెక్టర్లు అభిషేకం, నరేష్, ఎజాస్, యాదగిరి, ఎస్‌జీఏఎస్ దామోదర్, గ్రేడ్-3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ. 11, వంకాయ 35, బెండ 47, పచ్చిమిర్చి 43, కాకర 40, బీర 45, కాలీఫ్లవర్ 15, క్యాబేజీ 11, క్యారెట్ 18, దొండ 45, ఆలు 35, ఉల్లి 29, గోకర 35, దోస 25, సొర 13, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 50, అర్వి 50, చిలగడదుంప 23, బీట్‌రూట్ 18, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 35, కాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చిన్నారులకు టీకాలు వేయించండి

మలక్‌పేట: తొమ్మిది నెలల లోపు వయసు కలిగిన చిన్న పిల్లలకు తప్పక టీకాలు వేయించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజునీస్నాతో కలిసి బుధవారం శాలివాహననగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రిజునీస్నా మాట్లాడుతూ... పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొమ్మిది నెలల లోపు పిల్లలకు 2 టీకాలకు బదులుగా 4 టీకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరుణ్, పీహెచ్‌ఎన్ చంద్రకళ, స్టాఫ్ నర్సు కళావతి, ఏఎన్‌ఎమ్‌లు రిబికా, జ్యోతి, ఫార్మసీ మానస, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శ్రమదానం



శ్రమదానం చేస్తున్న భక్త సమాజం సభ్యులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ వైదేహీనగర్ శివాలయం వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ కోసం తవ్విన మట్టిని తొలగించడంలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మట్టిని తొలగించాలని మల్లికార్జున భక్త సమాజం అధికారులకు విన్నవించినా స్పందించలేదు. దీంతో బుధవారం భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దగోని సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి మట్టిని తొలగించారు. కార్యక్రమంలో నేతలు ప్రవీణ్, రామకృష్ణ, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజేష్‌పై ఫిర్యాదు



మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ ఎస్సీ నాయకులు

చంచల్‌గూడ: సరస్వతీదేవిని అవమానపరుస్తూ ప్రసంగం చేసిన రేంజర్ల రాజేష్ అనే వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా దేవతను అసభ్య పదజాలంతో వ్యంగ్యంగా సంబోధించిన రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం కుర్మగూడ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దర్శనం ప్రదీప్‌కుమార్ మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎస్సీ మోర్చా నాయకులు నాగరాజు, మోహన్‌కృష్ణ, అజయ్, ప్రేమ్, జనపాల మధు ఉన్నారు.

‘నిషా’చరులూ మారరా?

- మద్యం మత్తులో వాహనాల డ్రైవింగ్
- ప్రమాదాలకు కారణమవుతున్న మందుబాబులు
- మార్పు కోసం ట్రాఫిక్ పోలీసుల కౌన్సెలింగ్
- జరిమానా విధిస్తూ.. జైలుకు పంపుతున్న వైనం
- అయినా మందుబాబుల్లో కానరాని మార్పు



టీటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

మద్యం సేవించి మత్తులో వాహనాలు నడపొద్దని.. అలా చేస్తే వారితోపాటు ఎదుటివారి ప్రాణాలకూ ప్రమాదం ఉందంటూ ట్రాఫిక్ పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా మందుబాబుల్లో కనీస మార్పు రాడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కొందరికి జరిమానాలు విధిస్తూ, మరి కొందరిని జైలుకు పంపుతున్నారు. ఇన్ని జరుగుతున్నా మందుబాబుల్లో మార్పు కనిపించడం లేదనే చెప్పొచ్చు. నిత్యం మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ వందలాది మంది ట్రాఫిక్ పోలీసులకు దొరికిపోతుంటడమే ఇందుకు నిదర్శనం.

నాగోలు: నిత్యం మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ)లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పట్టుబడిన వారిలో 21 నుంచి 40 సంవత్సరాలోపు వారే ఎక్కువగా ఉంటున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రింక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన రోజు దాదాపు 15 మందికి పైగా మందుబాబులు పట్టుబడుతున్నారు. వారిలో మైనర్లు కూడా ఉంటున్నారు. అలా పట్టుబడిన వారికి ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంపు ఆఫీస్ వద్ద ఉన్న టీటీఐ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.



ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్

- గతంలో ఒక బ్యాచ్‌లోనే కౌన్సెలింగ్ పూర్తయ్యేది. ఇప్పుడు 10 బ్యాచ్‌లుగా డివైడ్ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- మద్యం సేవించి వాహనలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎన్నో ప్రమాదాల వీడియోలు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
- మీరు చేసిన తప్పు వల్ల ప్రమాదంలో అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని వివరిస్తూ ప్రమాదాల వీడియోలను చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
- ప్రమాదం జరిగితే మనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటని.. ఒక్క సారి ఆలోచించాలని అవగాహన కల్పిస్తూ వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.
- కొత్త సంవత్సరంలో గట్టి నిర్ణయం తీసుకోవాలని.. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, సీటు బెల్లు, హెల్మెట్ పెట్టుకోవడం తదితర నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.
- ప్రముఖుల సందేశాలు, సందేశాత్మక గీతాలు, రోడ్డు ప్రమాదాల దృశ్యాలు, సీసీ ఫుటేజీల్లో నమోదైన వాహనాలు నడిపే తీరును ప్రదర్శిస్తున్నారు.
- వాహనాలను నడిపే వేళ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వారు గుర్తు చేస్తున్నారు.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకుంటే ఆనుకోకుండా ప్రమాదాలకు గురైనప్పుడు తీవ్ర గాయాలైన సంఘటనలు ప్రదర్శించారు.
- నూతన సంవత్సరం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో ‘డ్రింక్ అండ్ డ్రైవ్’ తనిఖీలను నిర్వహిస్తామని పోలీసులు హెచ్చరించినా చాలామంది ఖాతరు చేయకుండా మద్యం సేవించి వాహనాలు నడిపారు. దీంతో వందల మంది మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు.

మార్పు రావాలనే...



మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి పైన్లు విధించి, జైలుకు పంపినా మార్పు రావడంలేదు. మద్యం సేవించి పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి జరిగే అనర్థాలపై అవగాహన కలిస్తూ వారిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నాం.

– జోసఫ్, రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి

అవగాహన కల్పిస్తున్నాం



రాచకొండ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన వారికి ఎల్‌బీనగర్‌లోని టీటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రమాదాల గుర్తించి ప్రముఖుల సందేశాలను, సందేశాత్మక గీతాలనూ, రోడ్డు ప్రమాదాల దృశ్యాలు, సీసీ ఫుటేజీల్లో నమోదైన వాహనాలు నడిపే తీరును ప్రదర్శించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

– అల్లురయ్య, ఎస్‌పీఓ

ప్రణాళికాబద్ధంగా పైప్‌లైన్ల నిర్మాణం

- తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 4 కోట్ల మంజూరు
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో పలు కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 4 కోట్లు మంజూరైనట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. పైప్‌లైన్ల నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం తన కార్యాలయంలో వాటర్‌వర్క్స్ జీఎంలు బలరాంరాజు, వినోద్, ఎన్‌సీపీ ప్రతినిధి పూర్ణచందర్‌రావులో సుధీర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొన్ని నెలలుగా వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్‌తో నియోజకవర్గంలో పలు కాలనీల ప్రజల సంక్షేమ సంఘలతో మంచి నీటి పైప్‌లైన్ల కోసం సమావేశం ఏర్పాటు చేయించామని తెలిపారు. ఎక్కడెక్కడ పైప్‌లైన్లు వేయాలో మాస్టర్ ప్లాన్‌ను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని అధికారులకు సూచించారు. శివారులోని ప్రతి కాలనీకి మంచి నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డీజీఎం సరిత, శ్రీను రమ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు న్యూమలక్‌పేట, ఫుట్‌బాల్ గ్రౌండ్, హాకీ గ్రౌండ్, లాలజార్ హోటల్, మలక్‌పేట రైల్వే స్టేషన్, చంచల్‌గూడ రోడ్, కాలడేరా కాలనీ, కాలడేరా స్లమ్, అక్బర్ టవర్, అష్రాఫ్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.
- మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సీ క్వార్టర్స్, ముంతాజ్ కాలనీ క్రాస్‌రోడ్స్, హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు డీఈ వివరించారు.

లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులు

జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి



జిల్లా విద్యాశాఖాధికారి రోహిణిని సన్మానిస్తున్న దృశ్యం

సైదాబాద్: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం మలక్‌పేటలోని అంధ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... లూయిస్ చేసిన కృషి అంధుల విద్యకు దోహదపడుతున్నదన్నారు. న్యాయ సేవా సహకార సంస్థ సెక్రటరీ, జడ్జి మురళీమోహన్ మాట్లాడతూ... విద్యార్థుల హక్కులు, అవసరాల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వాటి పరిష్కారానికి తాను సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బాలికలు ఆటపాటలతో సందడి చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి రోహిణిని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, సైదాబాద్ మండల ఉప విద్యాధికారి రాధాకృష్ణ, హిమాయత్‌నగర్ ఉప విద్యాధికారి విజయలక్ష్మి, వెంకటరాములు, హెచ్‌ఎం ఫాతిమా, సుమతి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



అనిత (ఫైల్)

హస్తినాపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఇంజాపూర్ గ్రామానికి చెందిన మల్లెల జగన్‌తో అనిత రెండవ వివాహం గత నెల 14 జరిగింది. జగన్ ఇంటికి వచ్చిన అనిత(33) ఈ నెల ఒకటో తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త జగన్ అనిత ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా ఫలితం లేదు. దీంతో వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ.. కేసుల నమోదు

పహాడీషరీఫ్: రాచకొండ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశాలతో బాలాపూర్ పోలీసులు బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ ఆధ్వర్యంలో షాహీన్‌నగర్ ప్రధాన రహదారిపై గల జేజీఆర్ గార్డెన్ వద్ద వాహనాలను నిలిపి లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఛలానాలు విధించడంతో పాటు నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు ఎంవీఐ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

మీర్‌పేట: యువత సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. సీఐ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం హస్తినాపురంలోని అనన్య డిగ్రీ కళాశాలలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని, ఎక్కడైనా సమాచారం ఇవ్వాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తక్షణ రుణయాప్‌లు, ఓఎల్‌ఎక్స్ మోసాలు, పిష్పింగ్ లింక్‌లు, స్క్రీన్ షేరింగ్‌యాప్‌లు, క్యూఆర్ కోడ్ మోసాలపై విద్యార్థులకు వివరించడంతో పాటు సైబర్ మోసాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు.



సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ఆమడదూరం

సోషల్ మీడియా ‘షో’లకే పరిమితమైన కార్పొరేటర్



మొగిళ్ల మల్లేష్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆకుల శ్రీవాణి చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్‌ఎస్ డివిజన్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి మొగిళ్ల మల్లేష్ విమర్శించారు. బుధవారం కార్పొరేటర్ శ్రీవాణి డివిజన్‌లో 10వేల మందికి ఉత్తరాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలుసుకున్న మల్లేష్ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కార్పొరేటర్ ఉత్తరాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు డివిజన్ అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం సోషల్ మీడియా వేదికగా షో చేసుకుంటూ సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, స్థానిక ఎమ్మెల్యే మంత్రి సబితా ఇంద్రారెడ్డి గానీ ఏమీ నిధులు ఇవ్వడం లేదని ఆరోపణలు చేస్తూ తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బుధవారం కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ఇంటింటికి ఉత్తరాలను పంచే నీచమైన కార్యక్రమం చేపట్టిన కార్పొరేటర్‌ను నమ్మే పరిస్థితిలో డివిజన్ ప్రజలు లేరన్నారు. కార్పొరేటర్ చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని మల్లేష్ వివరించారు. రాబోయే కాలంలోనైనా బుద్ధి మారి డివిజన్ అభివృద్ధికి పాటుపడతారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, నూతన కాలనీల ఆవిర్భావం కారణంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఖాద్రీకాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తాగునీటి నల్లా కనెక్షన్లను మంజూరు చేశారని, కాలనీలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉంటున్నారని వారికి నీటి బిల్లులు రాకుండా చూడాలని కార్పొరేటర్ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... జలమండలి అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జమీర్, సయ్యద్ అబ్బాస్ పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

దివ్యాంగులకు ఫ్రీ బస్‌పాసుల పంపిణీ



దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ సూపర్‌బజార్ వద్ద ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్‌తో కలిసి స్థానిక పార్కులోని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు ఆర్టీసీ ఫ్రీ బస్ పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దివ్యాంగులకు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. వికలాంగుల కార్పొరేషన్ కమిషనర్ శైలజ, చైర్మన్ వాసుదేవారెడ్డి, ఫెడ్ అధ్యక్షుడు గంగారామ్, ప్రధాన కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని సంరక్షించాలని ఆందోళన

మద్దతు పలికిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



ఆందోళన చేస్తున్న హైవే కాలనీవాసులు

మన్సూరాబాద్: హైవేకాలనీలోని పార్కు స్థలాన్ని రక్షించాలని కాలనీవాసులు పార్కు స్థలం ఎదుట బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... 1985లో కాలనీ లేఅవుట్ పార్కు స్థలంలో పెద్ద బావి ఉండేదని, దాన్ని అంచెలంచెలుగా పూడ్చామన్నారు. ఈ స్థలం చుట్టూ ఎల్‌బీనగర్ పురపాలక సంఘంగా ఉన్న సమయంలో ప్రహరీ నిర్మాణం చేపట్టి గేటును ఏర్పాటు చేశారని వివరించారు. ఈ ప్రాంతంలో వినాయక మండపం నిర్మించుకుని ఏటా వినాయక ఉత్సవాలు, దసరా, బతుకమ్మ ఉత్సవాలను జరుపుకొంటున్నామని వివరించారు. ఆ స్థలం తనదంటూ ఓ వ్యక్తి దస్తావేజులు చూపించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయమై హయత్‌నగర్ సర్కిల్ అధికారులు, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆందోళన చేస్తున్న కాలనీవాసులకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మద్దతు పలికారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్, హరీష్, విజయభాస్కర్‌రెడ్డి, హేమలత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలతో దడ



గుంతలమయంగా తయారైన సత్యనారాయణపురం రోడ్డు

చైతన్యపురి: రోడ్డు గుంతలు పడి దశాబ్ద కాలం అవుతున్నా ఇంతవరకు అభివృద్ధికి నోచుకోలేదు. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులకు మొరపెట్టుకున్నా ఇదిగో అవుతుంది... అదిగో అవుతుంది అంటున్నారు తప్పితే ఇంతవరకు మోక్షం రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చైతన్యపురి డివిజన్ సత్యనారాయణపురం రోడ్డు దుస్థితి ఇది. చైతన్యపురి నుంచి ప్రభాత్‌నగర్, కొత్తపేట నాగోలుకు వెళ్లేందుకు దగ్గరి దారి కావటంతో ద్విచక్ర వాహనాలు, కార్లు నిత్యం వందలాదిగా ఈ గుంతల రోడ్డుపై తిరుగుతుంటాయి. సీసీ రోడ్డు వేసేందుకు రెండు పర్యాయాలు టెండర్ ప్రక్రియ పూర్తి అయినా కాంట్రాక్టర్ పనులు చేయలేదని అధికారులు తెలియజేస్తున్నారు. 15 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న ఈ రోడ్డు మొత్తం గుంతలు పడి, వర్షం వస్తే రోడ్డు మధ్యలో నీరు నిలిచి రాకపోకలకు మరింత ఇబ్బంది కలుగుతుందని, వెంటనే సీసీ రోడ్డు వేసి ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాళ్లను ఆధునికీకరిస్తాం

కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాళ్లలో మెరుగైన వసతులతో ఆధునికీకరించి ఆయా కాలనీలు, బస్తీవాసులకు అందుబాటులోకి తెస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ, హార్టీకల్చర్ అధికారులతో కలిసి కళ్యాణనగర్, బీ బ్లాక్స్ కాలనీల్లో పర్యటించారు. కళ్యాణ్‌నగర్ కమ్యూనిటీ హాల్ ఎదుట షెడ్డు నిర్మాంచాలని ఏఈ వెంకన్నకు కార్పొరేటర్ ఆదేశించారు. బీ బ్లాక్ క్వార్టర్స్‌లోని పార్కును ఆమె హార్టీకల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. పార్కులో పచ్చదనం పెంపొందించాలని, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, పార్కులో కూర్చోవటానికి సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. హార్టీకల్చర్ అధికారులు యమున, లలిత, డీఈఈ బన్సీలాల్, గోవింద్‌రాజు, స్వాతి, చందు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ: ఇద్దరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులతో నిందితులు

హస్తినాపురం: బైకులను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేవరపల్లి మండలం రావుల పాలెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్(32) ప్లంబర్‌గా పనిచేస్తూ జీడిమెట్ల ప్రాంతంలో నివసిస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా తాడూర్ మండలం పోల్మూర్ గ్రామానికి చెందిన దేశాని సంజీవరెడ్డి అలియాస్ సంజీవ(38) కారు డ్రైవర్‌గా పని చేస్తూ వనస్థలిపురంలోని క్రిస్టియన్ కాలనీలో ఉంటున్నాడు. వీరు తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే అత్యాశతో చోరీలు చేయాలని నిర్ణయించికున్నారు. ఈ క్రమంలో పార్కు చేసిన బైకులను దొంగిలించారు. వనస్థలిపురం పరిసర ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. రెండు బైకులను తాము దొంగిలించినట్లు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

వేడి నీరు పడి గాయపడ్డ బాలుడి మృతి

హయత్‌నగర్: వేడి నీరు పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. హయత్‌నగర్ పోలీసుల సమాచారం మేరకు... హయత్‌నగర్ డివిజన్ తిరుమలనగర్‌లో నివసించే డేవిడ్, గౌతమి దంపతులకు 11 నెలల కొడుకు అస్టిన్ జోసెఫ్ ఉన్నాడు. డిసెంబర్ 31న సాయంత్రం 5 గంటల సమయంలో గౌతమి స్నానం చేసేందుకు వేడి నీటిని బకెట్‌లో పెట్టుకుంది. ఆడుకుంటూ వచ్చిన జోసెఫ్ బకెట్‌లోని వేడి నీటిని మీద పోసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.